నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

13 హైదరాబాద్, గురువారం 29 ఫిబ్రవరి 2024 HYDERABAD



## క్యాడ్‌బరీలో పురుగులు

### అమీర్‌పేట్‌లోని ఓ సూపర్ మార్కెట్‌లో కొనుగోలు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 28 : అమీర్‌పేట్‌లోని ఓ సూపర్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన క్యాడ్‌బరీ చాక్లెట్‌లో పురుగులు కనిపించడం కలకలం రేపింది. నగరానికి చెందిన రాబిన్ విజయ్‌కుమార్ ఈనెల 9న క్యాడ్‌బరీ చాక్లెట్‌ను కొన్నాడు. కాగితం తెరిచి చూడగా, పురుగులు కనిపించాయి. దీంతో విజయ్‌కుమార్ ఈ విషయాన్ని వెంటనే బల్దియా అధికారుల దృష్టికి తీసుకొచ్చాడు. ఈ చాక్లెట్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రయోగశాలలో పరీక్షించగా అందులో పురుగులు, వలలు ఉన్నట్టు గుర్తించారు. క్యాడ్‌బరీ డైరీ మిల్క్ చాక్లెట్స్ తినడం సురక్షితం కాదని, వీటికి దూరంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



సజావుగా ▸ సిటీబ్యూరో : తొలిరోజు ఇంటర్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్ జిల్లాలో 82,732 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.




కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలు సయ్యద్ అక్బర్, సాయి

# కాంగ్రెస్ రౌడీయిజం

## బీఆర్ఎస్ కార్యకర్తల కిడ్నాప్, దాడి

### కాంగ్రెస్ నాయకుల ప్రోద్బలంతోనే అని బీఆర్ఎస్ ఆరోపణ

### కేసు నమోదు చేసిన పోలీసులు

### అదుపులో ఐదుగురు నిందితులు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 28 : జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నాయకులు, రౌడీమూకలతో కలిసి దాడులకు తెగబడ్డారు. యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో నివాసముంటున్న సయ్యద్ అక్బర్ (23), కృష్ణానగర్‌లో ఉంటున్న సాయి కుమార్ అనే యువకుడు సుమారు ఐదేండ్లుగా బీఆర్ఎస్ పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. కృష్ణానగర్‌లో నివాసముంటున్న మహ్మద్ ఇస్మాయిల్ అలియాస్ చోర్ అబ్బూ బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్‌కు ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. మంగళవారం రాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నం.10 నుంచి వెంకటగిరికి వెళ్లేదారిలో కాపు కాసిన చోర్ అబ్బూతో పాటు అబేజ్, అల్తాఫ్, శ్రీకాంత్ చౌదరి, సీహెచ్. సాయి, శ్రీనాథ్ అనే కాంగ్రెస్ కార్యకర్తలు జిమ్ నుంచి బయటకు వచ్చిన సయ్యద్ అక్బర్‌ను బలవంతంగా బైక్ మీద ఎక్కించుకొని.. కొట్టుకుంటూ గాయత్రీహిల్స్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. ఎక్కడకు వెళ్లకుండా బంధించడంతో పాటు కర్రలతో కొడుతూ తన మీద గతంలో తప్పుడు కేసులు పెట్టానని.. ఒప్పుకో అంటూ వీడియోలు తీశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్ రాజ్ కుమార్ చెప్పడంతోనే కేసులు పెట్టానని చెబితేనే వదిలిపెడుతామని, లేకుంటే ఇక్కడే చంపేస్తామంటూ తీవ్రస్థాయిలో దాడికి పాల్పడ్డారు. భయాందోళనకు గురైన అక్బర్ వారు చెప్పిన విధంగా వీడియోలో చెప్పాడు. అక్కడి నుంచి కృష్ణానగర్‌లోని సింధూ టిఫిన్ సెంటర్ వద్దకు వచ్చి బీఆర్ఎస్ కార్యకర్త సాయిపై పిడిగుద్దులతో విరుచుకుపడడంతో పాటు పైప్‌తో దాడికి పాల్పడ్డారు. ఇప్పుడు నడుస్తున్నది మా ప్రభుత్వం.. ఇక నుంచి మీరు పరుగెత్తాలి.. అంటూ దుర్భాషలాడారు. వారి వద్ద నుంచి తప్పించుకుని వెళ్లేందుకు ప్రయత్నించగా వెంటపడి మరోసారి దాడికి పాల్పడ్డారు. స్థానికులు డయల్ 100 ద్వారా జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడకు చేరుకోవడంతో చోర్ అబ్బూ తదితరులు అక్కడి నుంచి పారిపోయారు. బాధితులు ఉస్మానియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితులు.. తమపై జరిగిన దాడిని మీడియాకు వివరించారు. బాధితుల ఫిర్యాదుతో నిందితులు చోర్ అబ్బూ, అబేజ్, అల్తాఫ్, శ్రీకాంత్ చౌదరి, సీహెచ్.సాయి, శ్రీనాథ్‌ల మీద ఐపీసీ 324, 342,363,506 రెడ్ విత్ 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు.. సీసీ ఫుటేజీని సేకరించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆగడాలు రోజురోజుకూ శ్రుతి మించుతున్నాయని కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్ అన్నారు. యూసుఫ్‌గూడ్ డివిజన్ బీఆర్ఎస్ కార్యకర్తలు అక్బర్, సాయిపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి గురించి సమాచారం అందుకున్న కార్పొరేటర్లు బాధితులకు సంఘీభావం తెలిపారు. ఈ దాడుల వెనుక బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ ఉన్నారని ఆరోపించారు.

# పని మూరెడు.. ఖర్చు బారెడు

## బల్దియాలో డిప్యూటేషన్లకు ఎర్రతివాచీ

### అడ్డు అదుపు లేకుండా వచ్చి చేరుతున్న డిప్యూటీ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు

### ఖజానాకు గుదిబండగా మారుతున్న వైనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): ఒకవైపు ఉద్యోగులకు నెలవారీగా వేతనాలు సకాలంలో అందని పరిస్థితి...పైగా నిధుల్లేక లేక అభివృద్ధి పనులు పట్టాలెక్కడం లేదు. పురోగతి పనులకు అతీగతి లేదు. కాంట్రాక్టర్లు సైతం బకాయి బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడతామంటూ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. ఆశించిన స్థాయిలో ఆస్తిపన్ను వసూళ్లు లేవు. ఈ పరిస్థితిలో అధికార యంత్రాంగం లోపాలను సరిదిద్దుకుని పొదుపు మంత్రాలతో సంస్థను గట్టెక్కించాల్సి ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఇష్టారీతిన డిప్యూటేషన్లపై వస్తున్న అధికారులతో బల్దియా ఖజానాకు మరింత భారంగా మారుతున్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు దాదాపుగా 15 మంది డిప్యూటేషన్‌పై డిప్యూటీ కలెక్టర్లు జీహెచ్‌ఎంసీకి వచ్చారు. ఎన్నికలు అయ్యాక ఒకరిద్దరికీ తప్ప.. మిగిలిన వారికి పెద్దగా పని లేదు. కొన్ని రోజులుగా వీరిని ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు ఇచ్చిన యంత్రాంగం..ప్రధాన కార్యాలయంలో సర్దుబాటు చేశారు. అయితే ఇటీవల కాలంలో ఎన్నికల బదిలీల్లో భాగంగా పురపాలక శాఖకు సంబంధించిన దాదాపు 14కి పైగా మున్సిపల్ కమిషనర్లు డిప్యూటేషన్‌పై జీహెచ్‌ఎంసీకి వచ్చారు. వీరిని సర్దుబాటు చేసే క్రమంలో గతంలో ఎన్నడూ లేని విధంగా డిప్యూటీ కమిషనర్లుగా ఎస్‌డబ్ల్యూఎం బాధ్యతలు అప్పగించారు. ఇష్టారీతిన వస్తున్న డిప్యూటేషన్లతో ఖజానాకు భారమే తప్ప..వారి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థలో ఆర్థిక మాంద్యం ఉన్నప్పుడు అధికారులను తగ్గించాల్సింది పోయి వస్తున్న వారికి ఆహ్వానం పలుకుతున్నారని, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో సహా ఎందరో ఉన్నా రావాల్సిన ఆదాయాన్ని రప్పించలేక, ఆపై అడ్డగోలు అక్రమాలు జరుగుతున్నా వాటిని అడ్డుకట్ట వేయలేకపోతున్నారని నిండు సభలో పార్టీలకు అతీతంగా ముక్తకంఠంతో లోపాలను ఎత్తిచూపారు. కమిషనర్ రోనాల్డ్ రాస్ అప్పటి వరకు కొనసాగిన అదనపు కమిషనర్ (అడ్మిన్) సరోజను బదిలీ వేటు వేశారు. అయితే డిప్యూటీ కలెక్టర్ల విషయంలో మాత్రం నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. కౌన్సిల్ సమావేశం జరిగిన తర్వాతే దాదాపు డజను మందికి పోస్టింగులిచ్చారు. పోనీ ఈ పోస్టింగులైన అధికారుల స్థాయికి తగ్గట్లు బాధ్యతలున్నాయా అంటే అదీలేదు. గతంలో ఒక్కరు చేసిన పనినే నలుగురైదుగురికీ అప్పగించారు. దీంతో అధికారులు..వారికి అవసరమైన చాంబర్లు, కార్లు, సిబ్బందితో జీహెచ్‌ఎంసీకి ఖర్చుల భారం మరింత పెరుగుతుందే తప్ప..తగ్గదు. కేవలం తమ అవసరాల కోసం హైదరాబాద్ కు వచ్చేవారికి పునరావాస కేంద్రంగా జీహెచ్‌ఎంసీ మారుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నా పట్టించుకోవడం లేదు.

#### అంతా గందరగోళం

గతంలో సంస్థలో వైద్యం, ఆరోగ్యం, పారిశుధ్యం, దోమల నివారణ, కుక్కల నియంత్రణ తదితరమైనవన్నీ ఒకే అడిషనల్ కమిషనర్ నిర్వహించేవారు. అది సైతం ఐఏఎస్ అధికారి కాదు. సహాయకులుగా ఒక జాయింట్ కమిషనర్ ఉండే వారు. ప్రస్తుతం ఆరోగ్యానికి ఒక అడిషనల్ కమిషనర్, పారిశుధ్యానికి మరో అడిషనల్ కమిషనర్, ఇందులో ఒకరు ఐఏఎస్ ..అడిషనల్ కమిషనర్లకు సహాయకంగా నలుగురైదుగురు జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు. వీరందరికీ కార్లతో సహా సకల సదుపాయాలు జీహెచ్‌ఎంసీ ఖజానా నుంచే అందుతాయి. ఇటీవల జీహెచ్‌ఎంసీకి బదిలీపై వచ్చిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లకు రెండు జోన్లలోని పారిశుధ్య పనులు అప్పగించారు. మరో అడిషనల్ కమిషనర్‌కు లీగల్, విద్యుత్ విభాగం బాధ్యతలు అప్పగించారు. ఇంకో స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌కు ఎన్నికల విభాగం జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. రెవెన్యూ విభాగం నుంచి వచ్చిన డిప్యూటీ కలెక్టర్‌కు సైతం ఎన్నికల విభాగంలోనే మరో జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇంకో స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌కు ఆరోగ్య విభాగంలో జాయింట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కో విభాగంలో ఎంతమందిని నియమిస్తున్నారో అంతే లేదు.



#### భారమని తెలిసినా.. ఎందుకీ మౌనం?

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం ప్రతి నెలా వేతనాలు, పెన్షన్లకు రూ. 120-130 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అయితే సంస్థలో అవసరాల మేరకు మాత్రమే డిప్యూటేషన్లకు ప్రోత్సహించాలి. కానీ అలా జరగడం లేదు. హైదరాబాద్‌లో ఉండాలనుకునే ఉద్యోగులంతా పైరవీతో కొందరు..కమిషనర్‌ను సంప్రదించి మరికొందరు వస్తున్నారు. పోనీ వచ్చిన వారితో ఆశించిన స్థాయి ఫలితాలు శూన్యమనే చెప్పాలి. ఎందుకంటే జీహెచ్‌ఎంసీకి రావాల్సిన ఆదాయం రావడం లేదు. చెత్త సమస్యలు తగ్గడం లేవు. విద్యుత్ విభాగం నగరంలో చీకట్లను నివారించలేకపోతోంది. ప్రకటనల విభాగం అక్రమాలకు అడ్డాగా మారింది. రెవెన్యూ విభాగం ట్యాక్స్ ల్లోని లోపాలు అరికట్టలేకపోయింది. అంతేకాదు.. ఏ విభాగంలో చూసినా నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఇటీవల అభయహస్తం దరఖాస్తులు గాల్లో కొట్టుకు పోవడం అందుకు ఒక నిదర్శనం. అలాగే కార్పొరేటర్లు ఫోన్లు చేసినా.. అధికారులు స్పందించడం లేదు.

#### వివాదాస్పద డీసీలకు కీలక పోస్టులు

ఇటీవల డిప్యూటీ కమిషనర్ల బదిలీలు జరిగాయి. ఇందులో ఇద్దరికీ కీలక పోస్టుల్లో బాధ్యతలు అప్పగించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అల్వాల్‌లో పనిచేసిన సమయంలో ఓ డీసీ మహిళపై అసభ్యంగా ప్రవర్తించడం, మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసి.. సదరు డీసీని ప్రాధాన్యత లేని పోస్టులో నియమించాలని ఆదేశించింది. కానీ సదరు డీసీని హయత్‌నగర్ బాధ్యతలు అప్పగించారు. మరో డీసీ అవినీతి ఆరోపణలు ఉండగా, సికింద్రాబాద్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ ఇద్దరి పోస్టుల వెనుక కాంగ్రెస్ పెద్దలు, ప్రొఫెసర్ ఉన్నట్లు చర్చ జరుగుతున్నది.

## గ్రేటర్‌కు ఇద్దరు ఐఏఎస్‌లు..

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఇద్దరిని గ్రేటర్‌కు కేటాయించింది. రెండు నెలల కిందటే జోనల్ కమిషనర్ హోదాలో బదిలీపై వచ్చిన స్నేహ శబరీష్‌ను కొమురం భీం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయగా.. ఆమె స్థానంలో హేమంత్ సుందర్ రావుకు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. అదేవిధంగా హైదరాబాద్ రెవెన్యూ అడిషనల్ కలెక్టర్‌గా హేమంత్ కేశవ్ పాటిల్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



## నకిలీ వెబ్‌సైట్లతో చీటింగ్

సిటీబ్యూరో: పేరున్న కంపెనీల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు తయారు చేసి, ఆయా సంస్థల ఫ్రాంచైజ్ ఇస్తామంటూ నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కేపీహెచ్‌బీకి చెందిన బాధితుడికి ఇంటర్‌నెట్‌లో ఐటీసీ డిస్ట్రిబ్యూషన్.కామ్ అనే వెబ్‌సైట్ కనిపించింది. ఐటీసీ ఎఫ్‌ఎంసీజీ డీలర్‌షిప్ ఇస్తామంటూ ఉండటంతో వివరాలు పొందు పరిచి, రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 25 వేలు చెల్లించాడు. ఆ తరువాత వివిధ ఫీజుల పేరుతో రూ. 7.5 లక్షలు సైబర్‌నేరగాళ్లు వసూలు చేయడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీనిపై దర్యాప్తు ప్రారంభించిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పాట్నా కేంద్రంగా దందా నడుస్తున్నట్లు గుర్తించారు. పేరున్న కంపెనీ పేరుతో నకిలీ వెబ్‌సైట్ తయారు చేసి, ఆయా కంపెనీల ఫ్రాంచైజ్ ఇస్తామంటూ గూగుల్ యాడ్స్ ద్వారా ప్రమోట్ చేసుకుంటూ..అందిన కాడికి దోచేస్తున్నారు. ధీరజ్ కుమార్ అనే వ్యక్తి అంకిత్‌కుమార్, గౌరవ్‌కుమార్‌లతో కలిసి ఒక కాల్ సెంటర్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించి.. ముగ్గురిని అరెస్ట్ చేశారు.



# సంరక్షణ ఆపేశారు

- హైకోర్టు నిర్మాణానికి అగ్రికల్చర్ వర్సిటీ వంద ఎకరాలు కేటాయింపు
- ఆ భూమిలో మొక్కల సంరక్షణ నిలిపివేత
- వాడిపోతున్న ఔషధ మొక్కలు
- జీవవైవిధ్యానికి పొంచి ఉన్న ముప్పు
- సేవ్ ది వర్సిటీ అంటూ ఇప్పటికే గళమెత్తిన విద్యార్థి లోకం
- ఉద్యమాలను నీరు గార్చే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం

వ్యవసాయ యూనివర్సిటీ , ఫిబ్రవరి 28: రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో దాదాపు 100 ఎకరాల్లో రోజు వారీ కార్యక్రమాలు నిలిచిపోయాయి. నారు పోయడం, తెగుళ్లు సోకకుండా కాపాడటం, చీడపీడలను నియంత్రించడం, నూతన పద్ధతులను కనుగొనడంలో భాగంగా దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల క్షేత్ర ప్రదర్శనకు సిద్ధం చేసిన స్థలం..ఇప్పుడు నిరుపయోగంగా మారింది. దాదాపు 40 ఏండ్లుగా ఔషధ విభాగం అభివృద్ధి చేసిన 150 మొక్కల సంరక్షణ ఆగిపోయింది. అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయిస్తూ...కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 55ను జారీ చేసింది. దీంతో విద్యార్థులు భగ్గుమన్నారు. వర్సిటీలో పర్యావరణం..వ్యవసాయ పరిశోధనలు, జీవవైవిధ్యానికి ప్రమాదం పొంచి ఉందంటూ..ఆందోళన బాటపట్టారు. 'సేవ్ ది యూనివర్సిటీ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ...వెంటనే 55 జీవోను రద్దు చేయాల్సిందేనని నిరసనలు తెలిపారు. వీరి ఉద్యమానికి ప్రతిపక్షాల నేతలు, రైతు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అయినా.. కాంగ్రెస్ ప్రభుత్వం వినలేదు.పైగా ఉద్యమాలను నీరే గార్చే పనిలో పడింది. మరోవైపు వంద ఎకరాల వర్సిటీ భూమిలో ఉన్న చెట్లు, మొక్కల సంరక్షణ నిలిపివేయడంతో అవన్నీ వాడిపోతున్నాయి. పైగా ఇదే భూమిలో ఉన్న డ్రోన్ శిక్షణా కేంద్రాన్ని ఎత్తివేసేందుకు సిద్ధం అవుతున్నారు.

#### గతమెంతో ఘనం..

అగ్రికల్చర్ యూనివర్సిటీలో 2014 నుంచి దాదాపు 67 కొత్త వంగడాలను సృష్టించారు. వర్సిటీలో400 రకాల వృక్షజాతులు, 80 రకాల పక్షులు, 350 అరుదైన జాతులతో పాటు జీవవైవిధ్యానికి కొదవ లేదు. వ్యవసాయరంగంలో నూతన సంస్కరణలు తెచ్చిపెట్టింది విశ్వవిద్యాలయం. అనేక జీవరాశులకు వివిధ రకాల చెట్లకు, పర్యావరణాన్ని పరిరక్షణలో వర్సిటీ కీలక భూమిక పోషిస్తున్నది. ఈ క్రమంలో హైకోర్టు నిర్మాణంతో వర్సిటీ పరిధిలోని పర్యావరణం దెబ్బ తింటుందని, వ్యవసాయ పరిశోధనలకు అపారనష్టం వాటిల్లుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆస్తిపన్ను బకాయిలపై 90% వడ్డీ రాయితీ

### అందుబాటులోకి ఓటీఎస్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : ఆదాయం రాబడిలో అవసరమైన అన్ని మార్గాలను బల్దియా అన్వేషిస్తున్నది. ఆస్తిపన్ను వసూళ్లలో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు జీహెచ్‌ఎంసీ అపసోపాలు పడుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 2100 కోట్ల టార్గెట్ విధించుకోగా, ఇప్పటి వరకు దాదాపు రూ. 1400 కోట్ల మేర మాత్రమే వసూలయ్యాయి. వచ్చే నెలలో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడం, అందులో ప్రధానంగా వచ్చే నెల రెండో వారంలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ..ఉన్న కీలక అధికారులంతా ఎన్నికల విధుల్లోకి వెళ్తారు. దీని ప్రభావం ఆస్తిపన్ను వసూళ్లపై పడుతుంది. ఈ నేపథ్యంలోనే ఆస్తిపన్ను వసూళ్లను పెంచాలని నిర్ణయించిన అధికారులు.. ఈ మేరకు బకాయిదారులకు ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ అందిస్తూ ఓటీఎస్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది బల్దియా. దీంతో బకాయి ఉన్న వారంతా తక్షణమే 10 శాతం వడ్డీతో మాత్రమే బకాయిలు క్లియర్ చేసుకునే వెసులుబాటు దొరికింది. 2022-23 ఆర్థిక సంవత్సరం మార్చి 31లోపు ఆస్తి పన్ను బకాయిదారులకు ఈ ఓటీఎస్ స్కీం వర్తించనున్నది. కాగా, జీహెచ్‌ఎంసీలో ఇప్పటివరకు రెండు సార్లు వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేశారు. మొదటిసారి 2020 ఆగస్టు 1 నుంచి నవంబర్ 15 వరకు, 2022 జూలైలో రెండోసారి అమలు చేశారు. రెండు సార్లు కలిపి బల్దియాకు రూ. 700 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరోసారి అమలు చేస్తే..రూ. 500 కోట్ల వరకు ఆదాయం రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.





# కుళ్లిన పదార్థాలతో అల్లం, వెల్లుల్లి పేస్ట్

## రూ. 5 లక్షల విలువైన సరుకు స్వాధీనం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ): కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విక్రయించేందుకు ఏజెంట్లను ఏర్పాటు చేసుకున్న తయారీదారుడితో పాటు ముగ్గురిని సెంట్రల్ టాస్క్ ఫోర్స్ జోన్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిపెర్మాల్ కథనం ప్రకారం.. గుజరాత్‌కు చెందిన రహీమ్ ఛారనియ హైదరాబాద్‌కు జీవనోపాధి కోసం వచ్చి బేగంపేటలో ఉంటున్నాడు. డెక్కన్ ట్రేడర్స్ పేరుతో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా సులువుగా డబ్బు సంపాదించేందుకు రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లిలో అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. వివిధ రకాల రసాయనాల రంగులు, ఆమ్లాలను ఉపయోగించి నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తున్నాడు. ఈ నకిలీ పేస్ట్‌ను కిరాణా, జనరల్ స్టోర్లు, వివిధ దుకాణాల ద్వారా హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా విక్రయిస్తున్నాడు. ఇందుకు బేగంపేటకు చెందిన పాండురంగారావు, బేగంబజార్‌కు చెందిన తెలంగాణ ఏజెన్సీ ప్రొపరేటర్ అజయ్‌కుమార్ అహీర్, పంజాగుట్టకు చెందిన నికిల్ ట్రేడర్స్ ప్రొపరేటర్ ప్రదీప్ సంకాలలను డిస్ట్రిబ్యూటర్లుగా నియమించుకున్నాడు. ఇలా మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఈ నకిలీ అల్లం, వెల్లుల్లిని విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో సెంట్రల్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు బేగంపేట పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి రహీం, పాండురంగారావు, అజయ్‌కుమార్, ప్రదీప్‌లను అరెస్ట్ చేశారు. రూ. 5 లక్షల విలువైన నకిలీ పేస్ట్‌ను, ముడి సరుకు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నకిలీ అల్లం, వెల్లుల్లిలో మురిగిపోయిన వస్తువులను కూడా వాడుతున్నట్లు వెల్లడైంది. 20 కిలోల కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.